క్లుప్తంగా

గంట్లమ్మ ఆలయంలో ముదునూరి ప్రత్యేక పూజలు



గంట్లమ్మ ఆలయం వద్ద ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: పట్టణంలోని 6వ వార్డులో వేంచేసి ఉన్న శ్రీ గంట్లమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం అమ్మవారి ఆలయాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సందర్శించి ఆలయంలో ప్రతత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పతివాడ మార్కెండేయులు, చిట్టూరి కృష్ణ, శిరిగినీడి వెంకన్న, మల్లాడి బుజ్జి తదితరులు ఉన్నారు.

నాగారమ్మ జాతర ప్రారంభం

నరసాపురం: పట్టణంలోని 31వ వార్డులో వేంచేసి ఉన్న ప్రసిద్ధ శ్రీనాగారమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 19వ తేదీ వరకూ జరగనున్న ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేస్తున్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలు ఆకట్టుకున్నాయి. 18వ తేదీ రాత్రి అమ్మవారి జాతర వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం



మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికురాలిని సత్కరించిన దృశ్యం

సాక్షి, భీమవరం : సంక్రాంతి సందర్భంగా భీమవరం పట్టణంలోని మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికుల కాలనీలో హిందూ బంధు కార్యకర్తలు ఆధ్వర్యంలో బీజేపీ నాయకుడు పురిఘళ్ల రఘురాం సీనియర్ కార్మికులను ఘనంగా సత్కరించారు. అలాగే విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్ బాక్స్‌లను అందజేశారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర



కొమరాడ గొర్లమూడిలో ముత్యాలమ్మ అమ్మవారి గరగలను ఊరేగిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: మండలంలోని కొమరాడ గొర్లమూడి గ్రామంలో కొలువైయున్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర సోమవారం వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ రాట్నాల రామకృష్ణస్వామి, రాట్నాల వెంకటేశ్వరరావు, రాట్నాల నాగేశ్వరరావు, లోకం శ్రీను, గొర్తి గణపతిరావు, గ్రామపెద్దలు ఆధ్వర్యంలో అమ్మవారి గరగలను డప్పు వాయిద్యాలతోను, మేళాతాళాలతోను వైభవంగా గ్రామ పురవీధులలో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పోలేరమ్మ జాతర ప్రారంభం



పోలేరమ్మ జాతరలో పిల్లల పైనుంచి దాటుతున్న గణాచారి

ఉండి: యండగండిలో పోలేరమ్మ అమ్మవారి రెండు రోజుల జాతర ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆయా ప్రాతాల నుంచి విచ్చేసిన బంధువులు, గ్రామ ప్రజలు జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకునే భక్తులు ఘటాలు ఇవ్వడం జరిగింది. ఘటాలు ఎత్తుకుని రోడ్డుపై వెళుతున్న గణాచారులకు రోడ్డుపై చీరలు పరచి ఆ చీరలపై చిన్నారులను ఉంచి వారిపై నుంచి గణాచారి దాటి వెళితే బిడ్డలకు మంచి జరుగుతుందని ఈ ప్రాంత ప్రజల నమ్మకం. అనంతరం నడివీధిలో అమ్మవారిని ఉంచి సేవా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే మంగళవారం అమ్మవారిని పుట్టింటికి పంపే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

జూదరుల అరెస్టు

పాలకొల్లు అర్బన్: శివదేవునిచిక్కాల, దిగమర్రు, వాలమర్రు గ్రామాల్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై కె.శ్రీనివాస్ తెలిపారు. వీరి నుంచి రూ.5,670 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆనందోత్సాహాలతో సంక్రాంతి



యలమంచిలిలో నిర్వహిస్తున్న కోడి పందేలు



వడ్లవానిపాలెంలో కోడిపందేలను తిలకిస్తున్న మహిళలు

నరసాపురం రూరల్: మండలంలోని గ్రామాల్లో సంక్రాంతి పండుగను ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి తమ ఇళ్లకు వచ్చిన వారితో ఇంటింటా సంక్రాంతి శోభ కనిపించింది. సంక్రాంతికి పండుగను ఎంతో ఆనందంగా జరుపుకున్నారు. గతంలో రెండేళ్ల పాటు కరోనా నిబంధనలతో అంతంత మాత్రంగానే ఉండటంతో ఎన్నో ఏళ్ల తరువాత పండుగను ప్రతి ఇంటా కొత్తబట్టలు, పిండివంటలు, వినోద కార్యక్రమాలతో ప్రతి ఇల్లూ సందడిగా మారింది. ఇదిలా ఉంటే పండుగ వేడుకల్లో భాగంగా గ్రామాల్లో సంప్రదాయ కోడిపందేలను నిర్వహించారు. మండలంలోని లక్ష్మణేశ్వరం, చిట్టవరం, తూర్పుతాళ్లు, వేములదీవి, లిఖితపూడి గ్రామాల్లో కోడిపందేలను నిర్వహించారు. అయితే కోడిపందేల ముసుగులో గుండాటను నిర్వహించేందుకు చేసిన ప్రయత్నాలు సఫలీకృతం కాలేదు. పలుచోట్ల గుండాట నిర్వహణను పోలీసులు అడ్డుకున్నారు. అయినప్పటికీ కోడి పందేలను ఆనందంగా వీక్షించారు. ప్రధానంగా నరసాపురం ప్రాంతంలో పందేలను తిలకించేందుకు దూరప్రాంతాల నుంచి బంధువులు పెద్ద ఎత్తున ఈ ప్రాంతానికి చేరుకోవడం అనాదిగా వస్తోంది. గతంలో గుండాట, పేకాట, కోతాట తదితర జూదాలకు నిలయంగా మారిన ఈ పండుగ ఈసారి జూదం విషయంలో కట్టడి జరిగినట్లేనని పలువురు పేర్కొంటున్నారు. ఈనేపథ్యంలో పలుచోట్ల యువకులు, చిన్నారులు సైతం పందేలను వీక్షించేందుకు వచ్చి ఆనందంగా గడిపారు.



లక్ష్మణేశ్వరంలో కోడిపందేల బరుల్లో పందెం రాయుళ్ల సందడి

పందేలను తిలకించిన మహిళలు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మూడు రోజులు సంప్రదాయ కోడిపందేలు నిర్వహించారు. మండలంలోని తిల్లపూడి, శివదేవునిచిక్కాల, దగ్గులూరు, లంకలకోడేరు, వడ్లవానిపాలెం, పూలపల్లి, గొల్లవాని చెరువు, దిగమర్రు గ్రామాల్లో కోడి పందేలు జోరుగా సాగాయి. పందేలను తిలకించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున రావడంతో కోడి పందేల శిబిరాల వద్ద కోడి పకోడి, బిరియాని, కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిళ్ల దుకాణాల వద్ద కోలాహలం కనిపించింది.

జోరుగా పందేలు

యలమంచిలి: మండలంలో గ్రామాలలో సంప్రదాయ కోడి పందేలు జోరుగా సాగాయి. సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ఈ పందేలను తిలకించేందుకు రాష్ట్రంలోని ఇతర జిల్లాలతోపాటు తెలంగాణ నుంచి కూడా పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు. ఈ ఏడాది మహిళలు కూడా కోడి పందేలు ఆడేందుకు ఆసక్తి చూపారు. యలమంచిలిలో ఒక బరిలో కోడి పందేలతోపాటు చిన్న పిల్లలకు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. దీంతో ఆ ప్రదేశం జనంతో కిటకిటలాడింది.

మొగల్తూరులో..

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మూడు రోజుల పాటు సంప్రదాయ కోడి పందేలు నిర్వహించారు. మొగల్తూరు, పేరుపాలెం, కేపీ పాలెం, ముత్యాలపల్లి, వారతిప్ప, కాళీపట్నం, దారితిప్ప గ్రామాల్లో పందేలు జరిగాయి. గుండాటలు, పేకాటలు లేకపోవడంతో నిర్వాహకులు నిరుత్సాహం చెందారు.



దిగమర్రులో తలపడుతున్న కోడి పుంజులు



కలగంపూడిలో కోడి పందేలు



లిఖితపూడిలో పందెంలో తలపడుతున్న కోడిపుంజులు



మొగల్తూరులో కోడి పందాలకు సిద్ధమవుతున్న పుంజులు

అలరించిన బొమ్మల కొలువు



వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

పాలకొల్లు అర్బన్: సంక్రాంతి పర్వదినం రోజున బొమ్మల కొలువు తీర్చిదిద్దడం భారతీయ సంప్రదాయానికి ప్రతీక అని వైఎస్సార్ సీపీ నాయకురాలు, వాకర్స్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ కర్రా జయసరిత అన్నారు. వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షురాలు నీలిమ ఏర్పాటు చేసిన బొమ్మల కొలువును క్లబ్ సభ్యులు తిలకించి నీలిమను ప్రత్యేకంగా అభినందించారు. బొమ్మల కొలువులో హిందూ ఆరాధ్యదేవతల ప్రతిమలు, రకరకాల ప్రతిమలు ఏర్పాటు చేశారు.

ఘనంగా అ'పూర్వ' సమ్మేళనం



మొగల్తూరు ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల కలయిక

మొగల్తూరు: స్థానిక పెన్మత్స రంగరాజు ఉన్నత పాఠశాలలోని పూర్వ విద్యార్థులు సోమవారం సందడి చేశారు. 1997–98 బ్యాచ్ విద్యార్థులంతా సంక్రాంతికి గ్రామానికి చేరుకోవడంతో అంతా ఒకే చోట కలుసుకుని ఆనాటి మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యనేర్పిన గురువులను సత్కరించడంతో పాటు పాఠశాలకు ప్రింటర్, వీల్ చైర్‌ను బహూకరించారు. స్నేహితులంతా కలిసి భోజనం చేసి, ఆటపాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు.

బైబిల్ పరీక్షలో విజేతకు నగదు బహుమతి



కోపల్లె చర్చిలో బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

కాళ్ల: క్రిస్టియన్ యూత్ క్లబ్ ఆఫ్ ఇండియా గత ఏడాది డిసెంబర్ 10న నిర్వహించిన బైబిల్ పరీక్ష ఫలితాల్లో కోపల్లెకు చెందిన కొండేటి ధరణిజా, ఆకివీడు మండలం కమతవానిగూడెంకు చెందిన చుక్కా నీలవేణి, తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షారామానికి చెందిన గిప్సన్ తొలి మూడు స్థానాల్లో నిలిచినట్లు క్లబ్ వ్యవస్థాపకులు బంటుమిల్లి సురేష్ సోమవారం చెప్పారు. ఈ పరీక్షకు నాలుగు జిల్లాలనుంచి సుమారు వంద మంది హాజరయ్యారన్నారు. మొదటి స్థానంలో నిలిచిన ధరణిజాకు కోపల్లె లూథరన్ చర్చిలో క్లబ్ చైర్మన్ చేతుల మీదుగా రూ.10 వేల నగదును బహూకరించి విజేతకు అభినందించారు. అలాగే రెండు, మూడు స్థానాలు నిలిచిన వారి ప్రాంతాలకు వెళ్లి నగదు బహుమతిని అందజేస్తామన్నారు. స్థానిక ప్యారిస్ పాస్టర్ దాసరి లాజరస్ క్లబ్ ప్రతినిధులకు అభినందనలు తెలియజేసి ప్రార్థించారు. జిల్లా క్లబ్ ప్రెసిడెంట్ యేలేటి న్యూటన్, సీఆర్ దీనరాజు, పీసీసీ బుంగా ఆదాము, తనుకుల జీవరత్నం, చిల్లా సత్తిబాబు, చిల్లా దిలీప్, ఎరుకొండ రాజు, చిల్లా శేఖర్ కొండేటి భూషణం, క్లబ్ ప్రతినిధులు మద్దా రమేష్ బాబు, బుజ్జి పాల్గొన్నారు.

రూపాంతర దేవాలయ నిర్మాణానికి విరాళం

భీమవరం (ప్రకాశంచౌక్): రూపాంతర దేవాలయ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ నాయకుడు గాదిరాజు సుబ్బరాజు రూ.2 లక్షల విరాళాన్ని సోమవారం అందజేశారు. శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఆర్.కమల్‌రాజు పాల్గొన్నారు.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ చిత్రం ముద్రించాలి



భీమవరంలో మోషేన్‌రాజుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సాక్షి, భీమవరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని, పార్లమెంట్‌లో బిల్లు పెట్టడానికి అసెంబ్లీలో తీర్మానం చేసేలా కృషి చేయాలని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుకు కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతల పరశురామ్ వినతిపత్రం అందజేశారు. భీమవరంలో మోషేన్‌రాజును క్యాంపు కార్యాలయంలో సోమవారం కలసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పరశురామ్ మాట్లాడుతూ కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని, నూతన పార్లమెంట్‌కు అంబేడ్కర్ పేరు పెట్టాలని కోరారు. గ్రామాల నుంచి ఢిల్లీ వరకు ప్రజాపోరు రథయాత్ర జనవరి 26వ తేదీన విశాఖపట్నంలో ప్రారంభించి ఏప్రిల్ 14న ఢిల్లీ యాత్ర చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కె.ముసలయ్య, కె.విజయరావు, రావేల రవి, కొమ్ము రాజు, మిద్దపాక సిద్దులు, వీరన్నపేట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్య ప్రదర్శన

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి వార్షికోత్సవాల్లో భాగంగా సంక్రాంతిరోజు అమ్మ వారి కళావేదికపై ఏర్పాటు చేసిన శ్రీ మయూరి నృత్యాలయం హైదరాబాద్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యప్రదర్శన భక్తులను అలరించింది. కూచిపూడి నృత్యకారిణి దొంగ అనిషిత కూచిపూడి నృత్య అభినయాన్ని ప్రశంసించారు. అలాగే జగత్ విజేత నాట్యమండలి మిలట్రీ మాధవరం ఆధ్వర్యంలో ప్రదర్శించిన కనకదుర్గ మహత్యం నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. అలాగే సోమవారం పిప్పళ్ల ప్రసాద్ భీమవరం వారిచే సాయి సంకీర్తనలు, శ్రీమావుళ్లమ్మవారి నాట్యమండలిచే ప్రదర్శించిన రంగస్థల ఆణిముత్యాలు నాటకం ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నీరుల్లికూరగాయ పండ్ల వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారి ఉత్సవాల్లో..

నేడు మావుళ్లమ్మవారి వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 5 గంటలకు భరత నాట్యం, 6 గంటలకు సినీ మ్యూజికల్ నైట్, 8 గంటలకు శ్రీ తిరుపతమ్మ మహత్యం నాటకం కార్యక్రమాలను ప్రదర్శించనున్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

సాక్షి, భీమవరం: పట్టణంలో సంక్రాంతి సందర్భంగా భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ), ఐద్వా సంయుక్త ఆధ్వర్యంలో వివిధ వార్డుల్లో ఆట పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ నాయకుడు ఆర్.రమేష్ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా యువతీ యువకులు పేకాట, కోడిపందేలు వంటి జూదాల వైపు వెళ్లకుండా డీవైఎఫ్ఐ ప్రతి ఏటా ఆటలు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగానే ఆకివీడులో రాష్ట్రస్థాయిలో చెడుగుడు, వాలీబాల్, చెస్ వంటి పోటీలతోపాటు మహిళలకు ముగ్గులు, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించామన్నారు. భీమవరంలో నిర్వహించిన పోటీల్లో డీవైఎఫ్ఐ నాయకులు సీహెచ్ వెంకటేశ్వరావు, అన్నం రాంబాబు, రత్నరాజు, ముత్యాల శ్రీను, సాయమ్మ, కుమారి, చెల్లబోయిన గోవిందు పాల్గొన్నారు.

హరిలో రంగ హరి

ఆకివీడు: వంశపారంపర్య వృత్తిగా హరిదాసు వృత్తిని వదులుకోలేకపోతున్నామని, సంస్కృతిని కాపాడాలనే ఉద్దేశంతో పండుగ రోజుల్లో గ్రామాల్లో తిరుగుతున్నామని హరిదాసు పరంకుశం రాంబాబు చెప్పారు. మండలంలోని కుప్పనపూడి గ్రామంలో సంక్రాంతి పండుగ ముగింపు సందర్భంగా ఆయా ఇళ్లవద్దకు వెళ్లి 'శ్రీమద్రామాయణ గోవిందో హరి' అంటూ పండుగ ముగిసిందని చెబుతూ ఇంటింటికీ తిరుగుతున్నారు. నాలుగు తరాలుగా హరిదాసు వృత్తిని కొనసాగిస్తున్నామని, నెల పట్టిన రోజుల్లో గ్రామం అంతా తిరిగి ప్రదిక్షణలు చేస్తామని చెప్పారు. తన ముత్తాత కుప్పనపూడి గ్రామంలో హరిదాసుగా పనిచేశారని, తాత, తండ్రి ఇదే ప్రాంతంలో సంక్రాంతి పండుగను ప్రజలతో పంచుకున్నారని చెప్పారు. బతుకుతెరువు కోసం గ్రామం వదలి అమరావతిలో కాపురం ఉంటున్నామని, అక్కడ నుంచి ప్రతి సంక్రాంతి పండుగ నెల రోజులూ గ్రామంలోనే ఉంటామని చెప్పారు. గ్రామస్తులు పెద్ద మనస్సుతో అన్ని విధాలుగా ఆదుకుంటున్నారన్నారు. గత 30 ఏళ్లగా హరిదాసుగా పనిచేస్తున్నట్లు రాంబాబు వివరించారు.

క్రీడా స్ఫూర్తి అలవర్చుకోవాలి



వదలిలో వాలీబాల్ పోటీలు

పెనుగొండ: ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవరచుకోవాలని పెనుగొండ సీఐ జీవీవీ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం వదలిలో ఎస్సీ కాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద ఫ్రెండ్స్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు నిర్వహించడం వలన మట్టిలో మాణిక్యాలు వెలుగులోకి వస్తాయన్నారు. వదలి, పెరవలి, మంగళపాలెం, వదలి జూనియర్స్, వదలి సీనియర్స్, ఓడూరు, వెన్నపువారిపాలెం, ఖండవల్లి–1, 2, దేవ హైస్కూల్, పండితవిల్లూరు, ఆనందరావు పేట జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో కాసాని పెద్దిరాజు, తోట సురేంద్ర, నేలపాటి చిన్ని, ఉటాల చిన్న, తానేటి గిడియన్ రాజు, ఉప్పలపాటి చంటి, కంకిపాటి శ్యామ్, బాబులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

వీరవాసరం: వడ్డిగూడెంలో షార్ట్ సర్క్యూట్‌తో సోమవారం తెల్లవారుజామున ఓ తాటాకిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన నేపాలం గంగరాజు ఇంట్లో నిద్రిస్తుండగా అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. రోడ్డు వెంట వెళుతున్న వ్యక్తి మంటలను చూసి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి మంటలను అదుపు చేశారు. మంటలను అదుపు చేసే క్రమంలో నేపాలం గంగరాజు కోడలు నేపాలం కుమారికి గాయాలయ్యాయి. సుమారు రూ.లక్ష మేర ఆస్తి నష్టం ఉంటుందని బాధితులు పేర్కొంటున్నారు. ఇంట్లో ఉన్న సామగ్రి అగ్నికి ఆహుతి అయ్యాయని వాపోయారు. ఘటనపై రెవెన్యూ అధికారులకు గ్రామ సర్పంచ్ సైదు శ్రీనివాసరావు సమాచారం అందించారు.

కోడి పందేలు, పేకాట శిబిరాలపై దాడి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఎస్సై వి.అప్పలరాజు తన సిబ్బందితో ఆరు కోడిపందేల బరులపై దాడిచేసి 12మందిని అదుపులోకి తీసుకున్నా రు. వీరి నుంచి 6కోడిపుంజులు, 6 కోడికత్తులు, రూ.7,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా రెండు చోట్ల పేకాట శిబిరాలపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 2,300 నగదును స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేశారు.

మోటారు సైక్లిస్టుకు గాయాలు

తాడేపల్లిగూడెం రూరల్: బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పాలకోడేరు మండలం మోగల్లుకు చెందిన సాంబ్రాణి సూర్యనారాయణ ఉంగుటూరులోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి తాడేపల్లిగూడెం వైపు వస్తుండగా ముత్యాలంబపురం వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడింది. దీంతో సూర్యనారాయణ తలకు గాయమైంది. బాధితుడి బావమరిది యర్రగోగుల వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ పోలీసులు తెలిపారు.